రూ.28 కోట్లతో ఉప్పల్ భగాయత్ అభివృద్ధి


మంత్రి శ్రీధర్‌బాబుతో పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 28 కోట్లు మంజూరైనట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో నెలకొన్న సమస్యలను శనివారం ఆయన ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికే పలుమార్లు భగాయత్ లేఅవుట్‌లో ఉన్న సమస్యలను సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

మల్కాజిగిరి: ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆకాంక్షించారు. శనివారం ఓల్డ్ మల్కాజిగిరిలోని ఉజ్జయనీ మహంకాళి అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు, బతుకమ్మ పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమన్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్ పఠాన్‌బస్తీ, జమామసీద్ ఏరియాలో నీటి సమస్య తీవ్రంగా ఉందని జలమండలి ఏఈ సిరాజుద్దీన్‌కు గ్రేటర్ కాంగ్రెస్ నేత నెమలి అనిల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. తాండ్ర శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌గౌడ్, అన్వర్, రఘు, హరి తదితరులున్నారు.

ఎంపీ ఈటలతో 'టీఆర్‌ఈటీఏ' సభ్యుల భేటీ


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ టీచర్స్

అల్వాల్: 'తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఉపాధ్యాయుల సంఘం' (టీఆర్‌ఈటీఏ) సభ్యులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆర్థిక బిల్లు-2025 వల్ల పెన్షనర్స్‌కు కలిగే నష్టాన్ని వివరించి, బిల్లు మార్పు, నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పూరి వెంకటయ్య, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అనిరుధ్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి నర్సింహ, మాజీ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదు

బోనాల చెక్కుల ఘర్షణ బాధితులకు పరామర్శ


మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని, చిత్రంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

గౌతంనగర్: అల్వాల్‌లో బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ కాంగ్రెస్‌ల మధ్య జరిగిన గొడవలో గాయపడిన వారిని బీఆర్ఎస్ నేతలు పరామర్శించారు. ఈ ఘర్షణలో గౌతంనగర్ కార్పొరేటర్ సునీత భర్త రాముయాదవ్, మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు జేపీసీ వెంకన్న, చిన్నయాదవ్‌లను శనివారం మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావుగౌడ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, గంగుల కమలాకర్, కాలేరు వెంకటేష్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనచారిలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోనాల చెక్కుల పంపిణీ దేశంలో ఎక్కడా లేదని, బోనాల పండుగను వైభవంగా జరుపుకోవాలని, ఎవరి వద్ద చందాలు వసూలు చేయకుండా ఉండాలని మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టారన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదని, ఈ దాడులకు సీఎం బాధ్యత వహించాలన్నారు. ఎవ్వరికైనా ప్రోటోకాల్ అనేది గౌరవప్రదమైందన్నారు. నగరంలో ఇలాంటి ఘటనలు జరగడం ద్వారా రాష్ట్రానికి చెడ్డపేరు వస్తుందని పేర్కొన్నారు. దీంతో నగరానికి పెట్టుబడులు రావని వ్యాఖ్యానించారు.

◆ మైనంపల్లి బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు పార్టీ ఎంపీ టిక్కెట్ ఇచ్చిందని, ఎమ్మెల్సీ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష పదవితో పాటు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి గెలిపించుకుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆయనకు అన్యాయం చేయలేదని, 'ఆయన కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేయించడం సరికాదన్నారు'. ప్రజలు బోనాల పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేకల సునీత, సబిత, శాంతి, నాయకులు బద్దం పరుశురామ్‌రెడ్డి, అనిల్‌కిషోర్‌గౌడ్, రమేష్, మధుసూదన్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్‌కు చెందిన సాయిప్రసాద్‌యాదవ్ శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ముందుకెళ్లాలని ఆయన సూచించారు. కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్, నాయకులు సురేష్, సాయికృష్ణ, జైకృష్ణ, నిఖిల్, కార్తీక్, భాను, జాన్, సంజు పాల్గొన్నారు.


కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సాయిప్రసాద్‌యాదవ్

సంస్కృతికి ప్రతీక బోనాలు


శ్రీ నికేతన్ పాఠశాలలో..

నందడి చేసిన విద్యార్థులు

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలతో ఆకట్టుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో విద్యార్థులు సందడి చేశారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం


సర్వతి ప్లే స్కూల్‌లో..


బోనాలతో అభ్యాస జూనియర్ కళాశాల విద్యార్థినులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి

మేడిపల్లి: కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అరికట్టే అవకాశం ఉందని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి అన్నారు. శనివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో ఆయన ఎస్వోటీ ఏసీపీ అంజయ్య, మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. సుమారు రూ. 6 లక్షల సొంత ఖర్చుతో 85 సీసీ కెమెరాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు.


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు


చిలుకానగర్, కావేరినగర్ వద్ద కుంగిన రహదారి

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో రెండో రోజు వర్షం ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేసింది. శనివారం సుమారు 2 గంటల పాటు కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రోడ్డు మార్గంలో గంటల పాటుగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం


నాచారం రాఘవేంద్రనగర్‌లో వరద నీరు

రెండో రోజు ముంచెత్తిన వర్షం


మల్లాపూర్ భవానీనగర్‌లో..

నల్లపోచమ్మ ఆలయంలో చండీయాగం


ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, సబ్‌స్టేషన్ ఆవరణలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద నిర్వహించిన చండీయాగంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్, గంధం నాగేశ్వరరావు, ముత్యం వెంకన్న, దూసరి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. శనివారం బోడుప్పల్‌లోని 27,28 డివిజన్‌లోని గ్రామకంఠంలో ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ మంజూరు కోసం ఆమె కమిషనర్ శైలజతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామకంఠంలో తొలిదశలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదని, హౌసింగ్ ఎండీ ఆదేశాల మేరకు రెండోదశలో పరిశీలిస్తున్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. కమిషనర్ శైలజ, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, డీఈ చిరంజీవులు పాల్గొన్నారు.


గ్రామకంఠంలోని ఇళ్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కుషాయిగూడ: సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ ప్రభుదాస్ సూచించారు. శనివారం హెచ్‌బీకాలనీ, ఇంద్రనగర్‌లో ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ లింగారావు, దూసరి నవీన్‌గౌడ్, పూస రమేష్, దుర్గారెడ్డి, మహేష్, శేఖర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుషాయిగూడ: నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాల కోసం 'క్యాడర్ టెక్ మహేంద్ర పౌండేషన్' దరఖాస్తులు ఆహ్వానిస్తుందని సంస్థ ప్రతినిధి నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్ కంప్యూటర్ కోర్సుల్లో 4 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈసీఐఎల్‌లోని టెక్ మహేంద్ర కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9100056583.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

కుషాయిగూడ: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు. శనివారం విద్యారణ్య సదనంలో జరిగిన లయన్స్‌క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్‌సిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జ్యోతిర్మయచారి, ప్రధాన కార్యదర్శి విష్ణుసాయి, కోశాధికారి మేకల యాదగిరిలతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందించారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 32సి ఫస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ కృష్ణారెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ మండా సురేష్‌కుమార్, మాజీ అధ్యక్షురాలు రమాదేవి, విజయ్‌కుమార్, హన్మంతరావు, రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'23న విద్యాసంస్థల బంద్' పోస్టర్ ఆవిష్కరణ

కుషాయిగూడ: విద్యార్థుల సమస్యలపై వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. ఈనెల 23న నిర్వహించిన తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు మద్దతునిస్తూ శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో విద్యాశాఖమంత్రిని నియమించి ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులు సాయిలు, రవి, కుమార్, రవళి, ఫాతిమా, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకని వెళ్లి.. విద్యార్థి అదృశ్యం


రాంచరణ్

మేడిపల్లి: బోనాల జాతరకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడలో నివాసం ఉంటున్న శ్రీనివాస్ కుమారుడు రాంచరణ్(17)ఇంటర్ ఫస్ట్ ఇయర్ పూర్తి చేసి కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. కాగా ఈనెల 17న మధ్యాహ్నం బోనాల జాతర కోసం స్నేహితులతో కలిసి మేడ్చల్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం స్నేహితులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం అడపా భరణి శిష్య బృందంచే నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. వీటితో పాటు థిమాటిక్ ఎగ్జిబిషన్, హస్తకళల ఉత్పత్తులు, కొండపల్లి బొమ్మలు, వెదురు బుట్టలు, చెరియల్ మాస్క్ బొమ్మలు ఆధునికతకు అద్దం పట్టేలా తయారు చేసిన ఉత్పత్తులు ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.